


# తుడా ఎవరికి?

**తుడా చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందనేది జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులు చాలావరకూ భర్తీ అయిన సంగతి తెలిసిందే. తుడా చైర్మన్ పదవిని అటు టీడీపీ, ఇటు జనసేన పార్టీల నుంచీ పలువురు ఆశించి పోటీ పడుతుండడంతో ప్రతిష్టంభన నెలకొంది. టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యత్వం పేరిట అదనపు హోదా తోడవుతున్నందున పలువురి కన్ను తుడా చైర్మన్ పదవిపై పడుతోంది. ఇతర పదవులు దక్కని వారు కూడా దీనికోసం రేసులో నిలుస్తున్నారు. ఆలస్యమయ్యే కొద్దీ ఈ పదవికి పోటీ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధినేత నిర్ణయం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.**

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● టీడీపీ, జనసేన ఆశావహుల పోటీతో ప్రతిష్ఠంభన

### టీడీపీ రేసులో పలువురు

తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు రెండూ కూటమి భాగస్వామ్య పక్షాలకు కేటాయించిన కారణంగా తిరుపతిలో పార్టీ పటిష్టంగా ఉండాలంటే తుడా చైర్మన్ పదవి టీడీపీ ఖాతాలోనే ఉండాలని ఆ పార్టీ స్థానిక నాయకులు ఆశిస్తున్నారు. తొలినుంచీ ఈ పదవికి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యం, మబ్బు దేవనారాయణరెడ్డి, డాలర్స్ దివాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన ఓ కాంట్రాక్టర్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. అయితే నరసింహ యాదవ్‌కు యాదవ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చినప్పటికీ ఆయన ఆ పదవి పట్ల సంతృప్తిగా లేరని సమాచారం. తనకు తుడా చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరినట్లు పార్టీ వర్గాల సమాచారం. దీంతో ఆయన మళ్లీ రేసులోకి వచ్చినట్టయింది. టీటీడీ బోర్డు మెంబరు పదవి ఆశించి నిరాశకు గురైన పార్టీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పేరు కూడా పార్టీ పరిశీలిస్తున్న జాబితాలో చేరింది. ప్రస్తుత దశలో వీరందరితో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన సతీమణి సుధారెడ్డిల పేర్లు కూడా అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి.

### జనసేన నుంచి తీవ్ర పోటీ

జనసేన పార్టీ నుంచీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ఇద్దరూ తుడా చైర్మన్ పదవి ఆశించారు. అయితే హఠాత్తుగా నిర్మాత ఎన్వీ ప్రసాద్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన కోసం మెగాస్టార్ చిరంజీవి గట్టిగా పట్టుబడుతున్నారనే ప్రచారం సాగుతోంది. మరోవైపు చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులు నాయుడు మనవరాలు చైతన్య పేరు కూడా ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఆమె పవన్ కల్యాణ్, చంద్రబాబు, లోకేశ్‌లు ముగ్గురినీ కలసి తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఇరు పార్టీల వర్గాలూ చెబుతున్నాయి. అయితే చైతన్యకు కాకుండా ఆమె తల్లికి ఏదో ఒక పదవి కేటాయిస్తామంటూ అధినేతలు నచ్చజెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. శ్రీకాళహస్తికి చెందిన ఓ టీడీపీ ముఖ్యనేత ఆమెకు తుడా చైర్మన్ పదవి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

### టీడీపీ అధినేత నిర్ణయంపై ఉత్కంఠ

ఇంతకీ తుడా పదవి టీడీపీ వారికా, జనసేనకా అనే చర్చ జోరుగా సాగుతోంది. జనసేనాని పవన్ కళ్యాణ్ తమ పార్టీకి కావాలని గట్టిగా పట్టుబట్టని పక్షంలో టీడీపీ వారికే దక్కుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. అధినేత నుంచీ సూచనప్రాయంగా కూడా ఎలాంటి సంకేతాలూ అందకపోవడంతో దీనిపై ప్రత్యేకించి తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల టీడీపీ, జనసేన వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంటోంది. అధినేత నిర్ణయం ఎలా ఉన్నా ఇక్కడి నేతలు శిరసావహించే పరిస్థితి ఉంది. అయితే ఆ నిర్ణయమే తిరుపతిలో టీడీపీ భవిష్యత్తును నిర్ణయించనుంది. అందుకే చంద్రబాబు తీసుకునే నిర్ణయం కోసం రాజకీయ వర్గాలతో పాటు ఈ ప్రాంత ప్రజానీకం సైతం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.




## అప్పుడేం జరిగింది?

● తిరుపతి కార్పొరేషన్లో గత అధికారులపై విచారణ
● ఆర్డీ నేతృత్వంలో లోతుగా ఆరా తీస్తున్న బృందాలు

తిరుపతి నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై విచారణ వేగవంతమైంది. మంత్రి లోకేశ్‌కు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాలతో గురువారం కార్పొరేషన్ కార్యాలయానికి విచారణ బృందం వచ్చింది. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో ప్రొద్దుటూరు, కళ్యాణదుర్గం, పుత్తూరు మున్సిపల్ కమిషనర్లతో పాటు ఓ రెవెన్యూ అధికారి, ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల బృందం విచారణ మొదలుపెట్టింది. గతంలో ఇక్కడ రెవెన్యూ అధికారిగా పనిచేసిన కేఎల్‌వర్మకు సంబంధించిన వ్యవహారాలపై ఆరా తీశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఇంటి పన్నులు పెంచిన, తగ్గించిన అభియోగాలపై రికార్డులను పరిశీలించారు. ఆయన దగ్గర పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన రెడ్డి,భాస్కర రెడ్డి,సూరిబాబు,ప్రకాష్, నవీన్‌లను విచారించారు. శుక్రవారం క్షేత్రస్థాయిలోనూ పరిశీలించి ఇంటి పన్నుల వ్యత్యాసాలపై తనిఖీ చేయనున్నారు.మున్సిపల్ గత మేనేజర్ చిట్టిబాబుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి కూడా విచారణ జరుగుతున్నట్లు సమాచారం. కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈవెంట్లకు సంబంధించి ఆర్గనైజర్‌కు అడ్డగోలుగా బిల్లులు చెల్లించారనే ఆరోపణపై ఆరా తీశారు.కార్పొరేషన్ అకౌంటెం ట్‌ను పిలిచి ఓచర్లను పరిశీలించారు.వారం రోజుల్లో ప్రభుత్వా నికి నివేదిక అందజేయనున్నట్టు తెలిసింది.



విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్

# సత్యవేడు గురుకులంలో
# జ్వరాల కలకలం

● 60 మంది బాధితులు ఆస్పత్రికి తరలింపు ● విద్యార్థులను పరామర్శించిన కలెక్టర్

సత్యవేడు, నవంబరు 14: సత్యవేడులోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 60 మందికి పైగా విద్యార్థులు జ్వరాల బారిన పడడం కలకలం రేపింది. గురువారం ఉదయం మెస్‌కు అల్పాహారానికి వెళుతున్న సమయంలో ఇద్దరు కళ్లు తిరిగి పడిపోయారు. తోటి విద్యార్థులు గుర్తించి వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. పాఠశాల స్టాఫ్‌నర్స్ భువనేశ్వరి విద్యార్థులను పరీక్షించగా జ్వరం తీవ్రంగా ఉందని నిర్ధారించారు. మరో 15 మంది కూడా జ్వరంతో బాధపడుతున్నారని గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి అందర్నీ తరలించారు. డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం చికిత్స అందించారు. 60 మందికి పైగా జ్వర బాధితులను గుర్తించారు. ఆరవ తరగతి విద్యార్థి శివశంకర్‌కు జ్వరం తీవ్రంగా ఉండడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాఠశాలను సందర్శించి వివరాలను ఆరా తీశారు. రుయాలో చికిత్స పొందుతున్న శివశంకర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సాధారణ వైరల్ ఫీవర్ మాత్రమేనని ధ్రువీకరించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డీసీహెచ్‌ఓ ఆనందమూర్తి, ఆర్డీవో కిరణ్మయితో కలిసి ఆస్పత్రిని సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, స్టాఫ్‌నర్స్ భువనేశ్వరిలతో సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు కోలుకునే వరకు పాఠశాలలో వైద్య బృందం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదిమూలం ఈ ఘటనపై ఆస్పత్రి డాక్టర్లు, పాఠశాల యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జ్వర బాధిత విద్యార్థులకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ, జాండీస్ తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చాయని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. పాఠశాలలో నీటి శాంపిల్స్ తిరుపతి పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌కు పంపించినట్లు వివరించారు. పాఠశాలలో మూడు రోజుల నుంచి పలువురు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిసింది.



చికిత్స పొందుతున్న విద్యార్థులు

### విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించండి

● కలెక్టర్‌కు మంత్రి సవిత ఆదేశం

సత్యవేడు, నవంబరు 14: సత్యవేడు బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యుఎస్, సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆరా తీశారు. వైరల్ ఫీవర్ వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న మంత్రి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీధర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అస్వస్థతకు గురయ్యారని అధికారులు వివరించారు. వైరల్ ఫీవర్ సోకినట్లు గుర్తించామన్నారు.

## డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య





తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీపద్మావతీ మహిళా డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు ఎస్వీయూ సీఐ రామయ్య కేసు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లా గుర్రంకొండకు చెందిన కృష్ణమూర్తి కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతని రెండవ కుమార్తె పి.అనిత తిరుపతిలోని శ్రీపద్మావతీ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బయోకెమిస్ట్రీలో చేర్పించాడు. ప్రస్తుతం ఈమె రెండవ సంవత్సరం చదువుతోంది. గురువారం అనిత క్లాసులకు హాజరుకాలేదు. మధ్యాహ్నం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు అనుమానం వచ్చి వార్డెన్‌కు విషయం తెలియజేశారు. ఎస్వీయూ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామయ్య, ఏఎస్ఐ దాము, కానిస్టేబుల్ అక్కడకు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉండడంతో వెంటనే మృతురాలు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు హాస్టల్ వద్దకు చేరుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. జరిగిన ఘటనపై విద్యార్థులు హాస్టల్ వద్ద కాసేపు ఆందోళన నిర్వహించారు. మృతికి గల కారణాలపై ఆరా తీయాలని డిమాండ్ చేశారు. కాగా స్వగ్రామంలో అనిత స్నేహితుడొకరు రెండు రోజుల క్రితం మృతి చెందడంతో అప్పటి నుంచి ముభావంగా ఉన్నట్లు సమాచారం. ఆ బాధలోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

## సప్తగిరులను కప్పేసిన పొగమంచు



తిరుమల శేషాచల కొండలను దట్టమైన పొగమంచు కప్పేసింది. నాలుగు రోజులుగా తిరుపతి, తిరుమలలో వర్షం కురుస్తున్న విషయం తెలిసిందే. వర్షం నిలిచిపోయిన సందర్భాల్లో పొగమంచు శేషాచల కొండలపై వాలిపోతోంది. స్వామి దర్శనం కోసం వచ్చే ప్రకృతి ప్రేమికులకు ఆ దృశ్యాలు ప్రత్యేక అనుభూతులను కలిగిస్తున్నాయి. ఘాట్ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు తమ వాహనాలను ఆపి మరీ కనులారా తిలకిస్తున్నారు. మరోవైపు తిరుమలలోనూ పొగమంచు కనువిందు చేస్తోంది. తెల్లటి మంచులో స్వామి ఆలయం, పార్కులు, అతిథిగృహాలు ప్రత్యేక అందాలను సంతరించుకున్నారు. స్వామి దర్శనం తర్వాత భక్తులు పొగమంచులో ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. ఇక, గురువారం కూడా పలు సందర్భాల్లో చిరుజల్లులు కురిశాయి.



### సిపాయికి మండలి ప్యానల్ వైస్ చైర్మన్ పదవి



తిరుపతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శాసనమండలి ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. మండలిలో బుధవారం ఈ నియామకం జరిగింది. ఎమ్మెల్సీగా నియామకమైన మొదటి ఏడాదిలోనే ఆయన ప్యానల్ వైస్ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల వైసీపీ వర్గీయులు, ఆయన అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## గృహ ప్రవేశానికి వచ్చి మృత్యు ఒడికి..

రోడ్డు ప్రమాదంలో తల్లీకూతుళ్ల మృతి



నుజ్జు నుజ్జు అయిన కారు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వారందరూ ఒకే కుటుంబ సభ్యులు. గృహ ప్రవేశానికి హాజరయ్యేందుకు వచ్చారు. మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని వేదాంతపురం వద్ద గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మినగర్ క్షత్రియ ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో కాపురముంటున్న బిల్డర్ రాజశేఖర రాజు వేదాంతపురం పంచాయతీ ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌లో నూతనంగా ఇల్లు నిర్మించాడు. గృహ ప్రవేశానికి అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రంగంపల్లి నుంచి ఆయన తల్లి సావిత్రి(80), చెల్లెళ్లు సంగీత(38), జ్యోతి, లక్ష్మీదేవి వచ్చారు. టీఎస్ 12-4581 నెంబరు కారులో ధనలక్ష్మీనగర్ నుంచి గృహ ప్రవేశం జరుగుతున్న ఎంజీ బ్రదర్స్ లేఅవుట్‌కు బయలుదేరారు. వేదాంతపురం క్రాస్ వద్ద బైపాస్ దాటుతుండగా నల్గొండ నుంచి బెంగళూరుకు వెళుతున్న బాలాజీ ట్రావెల్స్ బస్సు వేగంగా ఢీకొంది. దాదాపు 50 అడుగుల వరకు లాక్కెళ్లడంతో కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న సావిత్రి, సంగీత తీవ్రంగా గాయపడ్డారు. జ్యోతి, లక్ష్మీదేవి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ సావిత్రి, సంగీత మృతి చెందారు. మిగిలిన ఇద్దరి పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని పోలీసులు చెప్పారు. సంగీత తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రమేష్ భార్య. కాగా బస్సు డ్రైవర్ సురేష్‌ను అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసినట్లు పోలీసులు చెప్పారు. రాజశేఖర్ రాజు తమ్ముడు రాఘవరాజు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.



ప్రమాదంలో మృతి చెందిన సావిత్రి, సంగీత



# వైభవంగా పడి పూజ



స్వామివారికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న దృశం

చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద వెలసిన సుందరగిరి అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం పడి పూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, 7 గంటలకు పాలాభిషేకం, 8.30 గంటలకు 25 కలశ అభిషేకం, 10 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు నైవేద్యం, తీర్థ ప్రసాద కార్యక్రమం జరిగాయి. సాయంత్రం 5 గంటలకు దీప హారతి, 5.30 గంటలకు పుష్పాభిషేకం వైభవంగా నిర్వహించారు. సుగంధ పరిమళమైన వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు పడిపూజ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ లెక్కల పురుషోత్తమనాయుడు, అర్చకులు త్రివిక్రమ్, గురు స్వాములు వేణుగోపాల్‌నాయుడు, చంద్రాస్వామి, మోహన్‌స్వామి పాల్గొన్నారు. కాగా అయ్యప్పస్వామిని పులివర్తి వినీల్ దర్శించుకున్నారు. లెక్కల పురుషోత్తంనాయుడు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, ముడిపల్లి సురేష్‌రెడ్డి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, మునిరత్నంరాయల్, రాజులగారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ పోషకాలతో నేల సారవంతం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

భాకరాపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ పోషకాలతో నేల సారవంతంగా మారుతుందని జిల్లా వనరుల కేంద్రం ఏవోలు శ్రీనివాసులు, శశిధర్‌రెడ్డి అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రబీ సీజన్‌లో వరిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిలో సూక్ష్మ పోషకాల లోపం వల్ల దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి పచ్చి రొట్ట ఎరువులు విరివిగా ఉపయోగించాలన్నారు. అలాగే మామిడిలో సూక్ష్మ పోషకాల లోపాల నివారణ, పూత బాగా రావడానికి 'అర్క' మామిడి స్పెషల్‌ను లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. అడవి పందులు, ఎలుకల నివారణకు బయోస్టాప్ కెమికల్‌ను పొలం గట్లపై స్ప్రే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ధనలక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి ఏవోగా పదోన్నతి

భాకరాపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్-1)గా పని చేస్తున్న మదనమోహన్ రాజుకు మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి(ఏవో)గా పదోన్నతి లభించింది. ఆయనను ఎర్రావారిపాళెం మండల పరిషత్ ఏవోగా బదిలీ చేస్తూ జిల్లా కార్య నిర్వ హణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. మండల పరిషత్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేటి బాలలే రేపటి పౌరులు



అంగన్‌వాడీ కేంద్రంలో బాలల దినం నిర్వహిస్తున్న దృశ్యం

భాకరాపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి పౌరులని చిన్నగొట్టిగల్లు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. చిన్నగొట్టిగల్లు అంగన్వాడీ కేంద్రంలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల ఆటలు, పాటలతో అలరించారు. ఆటల పోటీలు పెట్టి బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరులో..



రూ.25వేలు నగదు అందజేస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హరిహర రెడ్డి

తిరుచానూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు హరిహరరెడ్డి హాజరై మాట్లాడుతూ నెహ్రూ గొప్పదనాన్ని వివరించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలలో జరిగే సైన్స్ దినోత్సవానికి తన వంతు సాయంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసేందుకు రూ.25వేలు విరాళంగా ఇచ్చారు. హెచ్‌ఎం మురళి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు వెంకటముని, పీడీ పళని సుదర్శన్, సురేంద్రబాబు, వెంకటాచలం, ఉపాధ్యాయులు కాత్యాయని, ప్రశాంతి, కృష్ణవేణి, లక్ష్మి, తేజోవతి, జమునారాణి, ప్రభావతి, గిరిజ, ఉమాదేవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీకి డస్ట్‌బిన్ వితరణ



డస్ట్‌బిన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

తిరుచానూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీకి లక్కీస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీ త్రిపుర ఇనుప డస్ట్‌బిన్‌ను అందజేశారు. వీటిని వార్డు సభ్యులు మునేంద్ర, లోకేష్ స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, ట్రస్టు గౌరవ సలహాదారు సాయిరాం పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలకు ఫైబర్ వైర్లు కడితే చర్యలు

● ఎస్ఈ సురేంద్రనాయుడు



చంద్రగిరి విద్యుత్ సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లు అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు ఫైబర్ వైర్లు కడితే చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ తిరుపతి ఎస్ఈ సురేంద్ర నాయుడు హెచ్చరించారు. గురువారం చంద్రగిరి సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పీఎం సూర్యఘర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉర్జా వీర్ గురించి ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్‌కు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ వాసురెడ్డి, డీఈఈ శేషాద్రి, ఏఈఈలు నాగరాజు, వెంకటరమణ, నీలకంఠయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## సినీనటుడు పోసానిపై ఫిర్యాదు

చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని మురళీకృష్ణపై రిపోర్టర్ పార్థసారథి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోసాని మురళీకృష్ణ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై అసభ్యకరంగా దూషిస్తూ, అసత్య ఆరోపణలు చేస్తున్నాడని, శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడుతున్నాడని, ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐ సుబ్బరామిరెడ్డికి ఫిర్యాదు చేశాడు.

## సింహ వాహనంపై పార్వతీపరమేశ్వరులు



చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో గురువారం ఉదయం శేష వాహనం, రాత్రి భూత వాహనంపై పార్వతీపరమేశ్వర్లు భక్తులకు దర్శనమిచ్చారు. తర్వాత స్వామివారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను అలంకరించి సింహ వాహనంపై ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

## హౌస్‌హోల్డ్, ఎన్‌పీసీఐ సర్వేలకి సహకరించండి

### పంచాయతీల్లో ఎంపీడీవో తనిఖీ



వేదాంతపురంలో చేపడుతున్న సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామచంద్ర

తిరుపతిరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పంచాయతీల్లో సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో చేపడుతున్న హౌస్‌హోల్డ్, జియోట్యాగింగ్, ఎన్‌పీసీఐ సర్వేలకు ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో రామచంద్ర కోరారు. మండలంలోని వేదాంతపురం, ఓటేరు గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మీడియాతో మాట్లాడుతూ ఇంటింటికీ జియోట్యాగింగ్ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సచివాలయ సిబ్బంది ఫొటో క్యాప్చరింగ్, బయోమెట్రిక్ తీసుకుంటారని వివరించారు. దీనిపై ఎటువంటి అపోహలు అవసరం లేదన్నారు. అలాగే బ్యాంకు ఖాతాలకు ఆధార్‌లింక్(ఎన్‌పీసీఐ) చేసుకోవాలని, దీనిద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల (డీబీటీ)సబ్సిడీలు నేరుగా ఖాతాలోకి చేరుతాయని వివరించారు. పంచాయతీ కార్యదర్శి మునీశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

**మధ్యాహ్న భోజనం పరిశీలన:**

మండలంలో వేదాంత పురంపంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు. అలాగే రజక దోబీఘాట్‌ని పరిశీలించారు.

## వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీపై విద్యార్థులకు అవగాహన

తిరుపతిరూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సర కోర్సులు చదివే విద్యార్థులకు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ మాట్లాడుతూ ఫొటోగ్రఫీలోని రకాలు, మొబైల్‌లో ఫోటోలు తీసేవిధానం, అటవీ పర్యావరణంలో ఎలా జీవించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ముని, గౌతమ్, పృథ్వీ, బృందసభ్యులు పాల్గొన్నారు.

## చంద్రగిరిలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయండి



షర్మిలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ కేపీఎస్ వాసు

చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. గురువారం విజయవాడలో చంద్రగిరి కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ కేపీఎస్ వాసు మర్యాదపూర్వకంగా ఆమెను కలిశారు. ప్రభుత్వంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొంటున్నారని, అదేతరహాలో సమావేశంలో ప్రతిపక్ష పార్టీ కో-ఆర్డినేటర్లు పాల్గొనేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## నా పెళ్లి ఇక్కడే జరిగింది

● గాయకుడు విజయ్‌ప్రకాష్



తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): 23 ఏళ్ల క్రితం తన పెళ్లి కూడా తిరుమలలోనే జరిగిందని ప్రముఖ గాయకుడు విజయ్ ప్రకాష్ గుర్తు చేసుకున్నారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన సతీమణి మహితితో కలిసి ఏటా స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి సంవత్సరం ఇక్కడికి వచ్చే భాగ్యాన్ని కల్పించాలని స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. అలాగే అందరిపై స్వామికృప ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఇక తమిళం, హిందీలో పాడిన పలు పాటలు త్వరలో విడుదల కానున్నాయన్నారు.

# గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



దామలచెరువు గ్రంథాలయ వారోత్సవాల్లో పాఠకులు

పాకాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువు శాఖాగ్రంథాల యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభించారు. 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ వారోత్స వాలలో కవి సమ్మేళనం, విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు, మహిళలకు రంగవల్లి అల్లికల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ ఇన్‌చార్జ్ మురళీ బాబు తెలిపారు. ప్రారంభ వేడుకల్లో పంచాయతీ కార్యదర్శి యుగంధర్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రఘునాథనాయుడు, చిన్నబ్బ నాయుడు, లక్ష్మీపతినాయుడు, బాబు నాయుడు, నాసీర్, సుధాకర్ నాయుడు, షనీబాయ్, రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ ఐదు మొక్కలు



మాట్లాడుతున్న కార్యదర్శి లక్ష్మీదేవి, పక్కన సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి

తిరుపతిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం చిగురు వాడ గ్రామ పంచాయతీలో సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. దీనిలో భాగంగా పంచాయతీ కార్యాలయం, కొత్తూరులోని చెత్తసంపద తయారీ కేంద్రం, అంగన్వాడీ కేంద్రం ప్రాంగణాల్లో ప్లాంటేషన్ నిర్వహించాలని తీర్మానం చేశారు. అలాగే ఆర్సీపురానికి వెళ్లే రోడ్డుమార్గంలో పంచాయతీకి సంబంధించిన స్థలంలో పడేస్తున్న చెత్త, వ్యర్థాలను తొలగించి దారిపొడవునా బఫర్‌జోన్‌లో 300మొక్కలు నాటాలని తీర్మానించారు. ప్రతి ఇంటికీ ఐదు పూల లేదా పండ్ల మొక్కలను అందించనున్నట్లు కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి పేర్కొన్నారు. 90శాతం ఉపాధి నిధులు, 10శాతం పంచాయతీ నిధులతో ఈపనులను చేపట్టనున్నట్లు ఆమె మీడియాకి వివరించారు.

# ఘనంగా బాలల దినోత్సవం



ఎస్వీఎన్ ఎంపీపీ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకల్లో చిన్నారులు

పాకాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దామలచెరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వ ర్యంలో పి.ఆనందయ్య, బేబి దంపతులు పిల్లలకు చాక్లెట్లు పంచిపెట్టారు. తాగునీటి బాటిళ్లు అందజేశారు. పాకాల ఎస్వీఎన్ మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు బాబ్జీ, లింగయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. లయన్ జయరామనాయుడు సహకారంతో పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దామలచెరువు లయన్స్‌క్లబ్ అధ్య క్షుడు నాగూర్‌బాషా, విద్యాకమిటీ చైర్మన్ పుణ్యవతి, వైస్ చైర్మన్ కరిష్మా, హెచ్‌ఎం విజయమోహన్ రెడ్డెప్ప, పత్తిపాటి రమేష్ నాయుడు, ఎస్వీఎన్ హెచ్‌ఎం మోహన్, పాకాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీ రామన్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు రామయ్య, కుప్పుస్వామినాయుడు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిరుమలలో జరగరాని అపచారాలు గతంలో జరిగాయి



తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గతంలో జరగరాని కొన్ని అపచారాలు జరిగాయని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమల శ్రీవారిని గురువారం తిరుప్పావడ సేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీవారి ప్రసాదాలు ఎలా ఉండేవో అందరం చూశామన్నారు. ఇప్పుడు ప్రసాదం తీసుకుంటే ఆత్మసంతృప్తి కలుగుతోందన్నారు. టీటీడీ పవిత్రత విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుమల పవిత్రతను కాపాడేందుకు సీఎం చంద్రబాబు చాలా మార్పులు చేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని, ముఖ్యంగా యువతకు మంచి ఉపాధి అవకాశాలు వచ్చేలా ఆశీస్సులు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నానన్నారు.

## నేటి బాలలే రేపటి దేశ సంపద



ఎర్రావారిపాళెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి దేశ సంపదని ఎంఈవో బాల సుబ్రమణ్యం అన్నారు. కస్తూరిబా బాలికల విద్యాలయంలో జాతీయ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆటల పోటీలు, చదువులో ప్రతిభ కనబరుస్తున్న పలువురు విద్యార్థులకు ఎంఈవో, ప్రిన్సిపాల్ పరిమళ బహుమతులు అందజేశారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం



చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి- శ్రీనివాసమంగాపురం మార్గంలోని స్వర్ణముఖి నది వంతెన కింద సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. మృతుడు బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, చారల తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిప్యూటీ స్పీకర్‌కు నాని అభినందన



చంద్రగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అభినందించారు. శాశసన సభలో మాట్లాడటానికి అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు.

## శ్రీవారి సేవలో ప్రముఖులు





ఆలయం ఎదుట దేవినేని ఉమామహేశ్వరరావు, ఇంద్రసేనారెడ్డి

తిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

# ఏనుగుల విధ్వంసం



ధ్వంసమైన టమోటా పంటను చూపిస్తున్న అరుణ

కల్లూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి):పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి పంచాయతీలో బుధవారం రాత్రి పంటలపై ఏనుగుల విధ్వంసం సృష్టించాయి. దీంతో టమోటా, వరి అరటి, బొప్పాయి పంటలకు అపారనష్టం వాటిల్లింది. సోమల మండలం సూరయ్యగారిపల్లి పంచాయతీ కరకమందకు చెందిన మురళి, రాజమ్మ, లత, అరుణ సువారపువారిపల్లి సమీపంలో 10 ఎకరాల్లో టమోటా పంట సాగు చేశారు. ప్రస్తుతం టమోటా కోతలు కొనసాగుతున్నాయి. అయితే బుధవారం రాత్రి ఏనుగుల గుంపు టమోటా పంటను ధ్వంసం చేశాయి. టమోటా తోటలో ఏర్పాటు చేసుకున్న పూరిపాకను దొర్లించిన ఏనుగులు అరటి, బొప్పాయి చెట్లను విరిచేశాయి. సమీపంలో ఉన్న మొహర్‌ఖాన్, జయరామయ్యకు చెందిన వరిపంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. ధ్వంసమైన పంటలను ఎఫ్‌బీఓ శ్రీదేవి పరిశీలించారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న జలవిహారం

నారాయణవనం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధంగా ఉన్న పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి పద్మ సరస్సులో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించి మూలవిరాట్‌లకు అభిషేకాలు నిర్వహించారు. 9 గంటలకు స్నపన తిరుమంజనం చేశాక ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను అలంకరించి ఊరేగింపుగా పద్మసరస్సుకు వేంచేపు చేశారు. అనంతరం స్వామివారు జలవిహారం చేశారు.

## 18న ఉద్యోగ మేళా

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల18న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ తెలిపారు.

## మూడో అంతస్తు నుంచి పడి భవన నిర్మాణ కూలీ మృతి

తిరుపతి (నేర విభాగం,) నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మూడో అంతస్తు నుంచి పడి ఓ భవన నిర్మాణ కూలీ మృతిచెందాడు. ఈ ఘటన తిరుపతి రూరల్ మండలం లింగేశ్వర్‌నగర్‌లో జరిగింది. తిరుపతి రూరల్ ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురానికి చెందిన బాబయ్య (మేస్త్రీ). గురువారం లింగేశ్వర్‌నగర్‌లో ఓ భవనానికి ప్లాస్టింగ్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అతడు మృతిచెందాడు. మృతుడి సోదరుడు చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.31 కోట్లు

ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది



ఐరాల(కాణిపాకం), నంవబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.1,31,12,759 ఆదాయం లభించింది. ఆలయ ఆస్థాన మండపంలో గురువారం స్వామి కానుకాలను ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. 19 గ్రాముల బంగారు, కిలో 420 గ్రాముల వెండితో పాటు 376 యూఎస్ఏ డాలర్లు, 75 యూఏఈ దిర్హామ్స్, 10 మలేషియా రింగిట్స్, 75 ఇంగ్లాండ్ పౌండ్లు, 60 యూరోలు లభించాయి. వీటితోపాటు గోసంరక్షణ హుండీ ద్వారా రూ.11,360, భక్తుల సౌకర్యార్థం అన్నదాన సత్రం ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.28,646 లభించాయి. ఈ ఆదాయం 22 రోజుల్లో సమకూరింది. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, వాసు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా మహాపూర్ణాహుతి

● వరసిద్ధుడి ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

ఐరాల(కాణిపాకం), నంవబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలోని వరసిద్ధుడి వినాయక స్వామి ఆలయంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం అవభృద, యాగపూజ, స్తండిల మండలేశ్వర పూజ, హోమవ్రత, మహాపవిత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, మహాదీపారాధన, యాత్రదానం, మూల విరాట్‌కు స్నపనాభిషేకం, కుంభ చండీయాగం, మహాదీపారాధన వైభవంగా నిర్వహించారు. ఏటా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాక పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గురుప్రసాద్, ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్లు కోదండ పాణి, వాసు, అర్చకులు ధర్మేశ్వరగురుకుల్, వేద పండితులు పాల్గొన్నారు.



## నేడు ఇందిరా మైదానంలో కార్తీక దీపోత్సవం

తిరుపతి(లీలామహల్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరా మైదానంలో ఇషోధ్యాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శివయ్య తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో వారు మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే క్లాసికల్ డ్యాన్స్, ప్రవచనాలు, కేరళ డ్రమ్స్, కోలాటాలు, పాట కచేరీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం పూజాసామగ్రి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు దాతలు సహాయ సహకారాలు అందించారని, మరింతమంది అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ హాజరై కార్తీక దీపోత్సవంలో పాల్గొని పరమశివుడి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ సమావేశంలో సుజన, హేమంత్, శాస్త్రి, రవి పాల్గొన్నారు.

## బాల్యం భగవంతుడు ఇచ్చిన వరం


చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న రిజిస్ట్రార్ రజని తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాల్యం అనేది భగవంతుడు ప్రతి మనిషికీ ఇచ్చిన ఓ అద్భుత వరమని పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని పేర్కొన్నారు. హోం సైన్స్ విభాగం నిర్వహిస్తున్న డే కేర్ సెంటర్‌లో గురువారం చేపట్టిన బాలల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల సంరక్షణ కోసం యూనివర్సిటీ హోం సైన్స్ విభాగం డే కేర్ సెంటర్ పకడ్బందీగా నిర్వహిస్తూ ఉండటం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేస్తున్న సిబ్బందిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ సుజాత, హోంసైన్స్ హెడ్ ప్రొఫెసర్ బిందు, ప్రొఫెసర్లు అరుణ, శిరీష, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

## నిత్యావసర ధరలను అదుపులో ఉంచాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి (కలెక్టరేట్) నవంబరు 14(ఆంధ్ర జ్యోతి): నిత్యావసర ధరలను అదుపులో ఉంచాలని, రాష్ట్ర ప్రజలపై వేసిన భారాలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి మాట్లాడుతూ రాష్ట్రంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. సామాన్యులు ఏమీ కొని తినలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూ సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు వాటిని మరింత జఠిలం చేస్తున్నాయన్నారు. పేదలపై విద్యుత్ చార్జీల భారం రూ.6,100 కోట్లు పడిందని తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, హరినాథ్, వెంకటేష్, సుమన్, లక్ష్మి, వేణుగోపాల్, నరేంద్ర, బుజ్జి, పాల్గొన్నారు.

## త్రిపుర గవర్నర్‌కు వీడ్కోలు


పుష్పగుచ్ఛం ఇచ్చి గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న జల్లి మధుసూదన్, భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(విద్య), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ వీడ్కోలు పలికారు. శ్రీవారి దర్శనార్థం గవర్నర్ బుధవారం తిరుమలకు వచ్చారు. దర్శనం అనంతరం గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు వీడ్కోలు పలికారు.

## ట్రెండ్స్ పాఠశాలలో బాలల దినోత్సవం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీవైఈవో బాలాజీ

తిరుపతి అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.బాలాజీ విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధి విజయసారథి వితరణ చేసిన ఎస్ఎక్స్‌కార్నర్ (స్మార్ట్‌టీవీ, ఇన్వర్టర్, ల్యాప్‌టాప్, డిజిటల్ సామగ్రి)ని ప్రారంభించారు. అనంతరం జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని హరిప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఎక్కువ రోజులు పాఠశాలకు హాజరైన విద్యార్థులకు, క్రీడల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కేశవులనాయుడు, పీడీలు రామకృష్ణ, సాంబశివరావు, కృష్ణమనాయుడు, దుర్గాబాయి, గిరి, లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కపిలేశ్వరస్వామి ఆలయంలో నేడు అన్నాభిషేకం

తిరుపతి(కల్చరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసోత్సవాలలో భాగంగా శుక్రవారం అన్నాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపడతారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు భక్తులకు అన్నలింగదర్శనం కల్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన చేపడుతారు. శుద్ధి అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు సుగంధద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహిస్తారు.

**కాశీవిశ్వేశ్వరాలయంలో ..**

కార్తీక మాసోత్సవాలలో భాగంగా మంచినీళ్లగుంట వద్ద ఉన్న అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వరాలయంలో శుక్రవారం శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతి తీర్థ స్వామి వారి ఆధ్వర్యంలో అన్నాభిషేకం జరుగనుంది.

## గాంధీభవన్‌కు విరాళం


విరాళం అందజేస్తున్న మునిరెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని గాంధీ భవన్‌కు టూవీలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి రూ.5వేలు విరాళాన్ని అందించారు. భవన్ ప్రధాన కార్యదర్శి పార్థసారథికి గురువారం నగదు అందజేశారు. బుధవారం కురిసిన వర్షానికి గాంధీ భవన్ ప్రహరీ పడిపోవడంతో పాటు చెట్లు విరిగిపడటంతో గేటు దెబ్బతింది. దీంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభు, గురునాథ ఆచారి, రాము, నరేంద్ర, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ నాయకులపై కేసులు ఎత్తి వేయాలి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ప్రతి పక్ష పార్టీలకు చెందిన బీసీ నాయకులపై అక్రమంగా నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ కోరారు. ఈ మేరకు గురువారం తిరుపతిలో ఎస్పీ సుబ్బరాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు

తిరుమల, నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 66,441 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,639 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

## నేడు కార్తీక పౌర్ణమి గరుడసేవ

తిరుమల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం కార్తీక మాస పౌర్ణమి గరుడసేవ నిర్వహించనున్నారు.రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ఈ వాహనసేవ జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి సువర్ణ కాంతులీనుతున్న గరుడుడిపై కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్తీక మాసంలో జరిగే గరుడ వాహన సేవ కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొననున్నారు.

## నిలకడగా బాలుడి ఆరోగ్యం

తిరుపతి(వైద్యం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలల్లో తీవ్ర జ్వరంగా బాధపడుతున్న శివశంకర్ అనే విద్యార్థిని గురువారం చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయా చిన్నపిల్లల విభాగానికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో హెచ్‌వోడీ మనోహర్ ఇతర వైద్యులతో కలిసి బాలుడ్ని పరీక్షించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని భయపడాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు.

# పుస్తక పఠనంతో విజ్ఞానం.. వికాసం


ప్రాంతీయ గ్రంథాలయంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

తిరుపతి(విద్య), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం వికసిస్తుందని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని తిరుపతి అర్బన్ ఎంఈఓ బాలాజీ పిలుపునిచ్చారు. బాలల దినోత్సవ వేడుకలతో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా పారంభమయ్యాయి. స్థానిక అన్నమయ్య కూడలి సమీపంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమాలకు బాలాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జండాను ఎగురవేసి, బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శివప్రసాద్, యంజీఎం ప్రధానోపాధ్యాయులు రవి, జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వంశీరాజు, దుర్గ, ఉపాధ్యాయులు లత, వెంకట్, వి సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ తహసున్నిస బేగం తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రాంతీయ గ్రంథాలయంలో..**

స్థానిక గోవిందరాజస్వామి ఆలయ దక్షిణ మాడ వీధిలోని ప్రాంతీయ గ్రంథాలయంలో వారోత్సవాలను ఎస్వీయూ గ్రంథాలయాధికారి ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్ర బాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ లైబ్రేరియన్ సూర్యనారాయణమూర్తి, అసిస్టెంట్ గ్రంథపాలకులు సునీల్‌బాబు, గ్రంథాలయ సిబ్బంది రాధమ్మ, రికార్డు అసిస్టెంట్ భారతి, ప్రతాప్‌రెడ్డి, మనిగందన్ పాల్గొన్నారు.

## సహకార వారోత్సవాలను జయప్రదం చేయండి


వారోత్సవాల సహకార జెండా ఆవిష్కరిస్తున్న పాలక మండలి సభ్యులు

తిరుపతి (ఆటోనగర్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సహకార వారోత్స వాలను ప్రజలు జయప్రదం చేయాలని తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కోనేటికట్ట వద్ద వున్న తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ భవనంపై 71వ సహకార వారోత్సవాల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండి ఎ.శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజులు పాటు సహకార రం గంలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఎం.నాథమునిరెడ్డి, కె.అమర్‌నాథరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, ఎం.చంద్రయ్య, సి.రమేష్, దొరబాబు, బ్యాంక్ సిబ్బంది డి.ఆనంద్‌కుమార్, ఎం.చంద్రబాబు, పి.భానుప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట రోడ్డులో భారీ గోతుల పూడ్చివేత


రేణిగుంట రోడ్డులో బొందలను పూడ్చుతున్న దృశ్యం

తిరుపతి అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులో ఏర్పడిన భారీ గుంతల పూడ్చివేత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొంత కాలం క్రితం జోరు వర్షానికి రేణిగుంట ప్రధాన రహదారి నారాయణాద్రి హాస్పత్రి ఎదురుగా రోడ్డు కుంగిపోయి భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిసిన సమయంలో అవి మరింత విస్తరిస్తున్నాయి. అప్రమత్తమైన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం చర్యలు చేపట్టింది. అండర్‌డ్రైనేజీ పైపులు పగిలిపోవడమే ఇందుకు కారణమని గుర్తించింది. సమస్యను శాశ్వతంగా పరిష్కరించే పనులలో భాగంగా పైపులు పగిలిన స్థలంలో నాలుగు గోడలు నిర్మించి స్లాబ్ వేస్తున్నారు. దానిపై యథావిధిగా రోడ్డును ఏర్పాటుచేసే పనులు సాగుతున్నాయి.

## ఘనంగా నెహ్రూ జయంతి


నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి (వైద్యం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ఎంతగానో కృషిచేసిన ఘనత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకే దక్కుతుందని పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెహ్రూ జయంతిని స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపాల్‌రెడ్డి, శివశంకర్, నరసింహులు, లోకేష్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## మా భూమిని మాకు ఇప్పించండి

● విశ్రాంత జవాను భార్య వేడుకోలు

తిరుపతి(లీలామహల్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ వద్ద గల తమ భూమిని ఆక్రమించారని విశ్రాంత జవాను భార్య పద్మజ వాపోయారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తన భర్త ఆర్మీ నుంచి ఉద్యోగ విరమణ పొందాక వచ్చిన డబ్బుతో 2018లో పేరూరు గ్రామ లెక్కదాఖలాలో బి.రామచంద్రారెడ్డికి చెందిన 197/1 సర్వే నెంబరులో 63 సెంట్లు భూమి కొనుగోలు చేశామన్నారు. అయితే పాత కాల్వకు చెందిన డి.కల్పన తమ స్థలాన్ని ఆక్రమించుకుని ప్రహరీ ఏర్పాటు చేశారన్నారు. ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రకాష్, హేమంత్‌ఆచారి, మహేష్, లక్ష్మి, విజయకుమార్, గురుమూర్తి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగండి


శిక్షణా కార్యక్రమ బుక్‌లెట్‌ని ఆవిష్కరిస్తున్న డెయిరీడీన్ నాగేశ్వరరావు, డీఈ శోభామణి, తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కోర్సుపూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసమే ఎదురుచూడకుండా ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదగాలని డెయిరీ టెక్నాలజీ విభాగ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్లో భాగంగా విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై నిర్వహించిన మూడ్రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంతంగా సంస్థలను స్థాపించి తమతోపాటు పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని తెలిపారు. డెయిరీ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కల్పించారు. వర్సిటీ డీఈ ప్రొఫెసర్ డాక్టర్ బి.శోభామణి, ఏడీ డాక్టర్ రవీంద్రారెడ్డి, హెడ్ డాక్టర్ వి. విజయగీత, అధ్యాపకులు వి.రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

# కాలువ భూమిలో నిర్మాణాలను అడ్డుకోండి

తిరుపతిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ సర్వే నంబరు 208లోని ప్రభుత్వ కాలువ భూమిలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఎంపీడీవో రామచంద్ర ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆంధ్రజ్యోతిలో గురువారం కాలువ భూమినీ కలిపేసుకుంటాం అనే శీర్షికతో ప్రచురితమైన కథనంపై స్పందించారు. సచివాలయానికి కూతవేటుదూరంలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపడుతుంటే పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అలాగే కాలువ భూమిలో నిర్మాణానికి పంచాయతీ అప్రూవల్ ఎలా ఇచ్చారని నిలదీశారు. దీనిపై స్పందించిన కార్యదర్శి మునీశ్వరి మాట్లాడుతూ.. కాలువభూమి పక్కనే ఉన్న లేఅవుట్‌లోని సర్వేనంబర్‌కి సంబంధించిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు చూపి గతంలో అప్రూవల్ తీసుకున్నారని, దీనిపై ఇప్పటికే నిర్మాణదారులకు ఉత్తర్వులు జారీ చేశామని వివరించారు. పంచాయతీ అప్రూవల్ రద్దుకు చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే ఇప్పటికే రెవెన్యూ అధికారులు కూడా స్థల సందర్శన చేసి కాలువ భూమిలో చేపడుతున్న నిర్మాణాలను నిలుపుదల చేయాలని సూచించారని తెలిపారు. దీంతో ఎంపీడీవో మాట్లాడుతూ.. రెవెన్యూ, పోలీసు అధికారుల సాయంతో అక్రమ నిర్మాణాల నిలుపుదలకు సత్వరమే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## సుబ్బారెడ్డి నగర్ వద్ద కాలువ పరిశీలన


సుబ్బారెడ్డి నగర్ వద్ద కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్, స్మార్ట్‌సిటీ అధికారులు

తిరుపతి (జీవకోన), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని సుబ్బారెడ్డి నగర్ వద్ద అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణాన్ని గురువారం మున్సిపల్ కార్పొరేషన్, స్మార్ట్‌సిటీ అధికారులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 11న అసంపూర్తిగా కాలువ నిర్మాణం అన్న శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు కాలువ నిర్మాణంపై సర్వే నిర్వహించారు. త్వరలోనే నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## షుగర్ వ్యాధిని అశ్రద్ధ చేయకూడదు


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరినాథ్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డయాబెటిక్ వ్యాధిని అశ్రద్ధ చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని దీనిని దృష్టిలో పెట్టుకొని డయాబెటిక్ బాధితులు జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ డయాబెటిక్ వైద్యనిపుణులు హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ డయాబెటిక్ డే సందర్భంగా స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని హర్షిత ఆస్పత్రిలో ఆయన ఉచిత డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు చికిత్సలు అందించారు. 110 మంది రోగులకు ఉచితంగా షుగరు, బీపీ, యూరిక్ యాసిడ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మాధవ రావు, విష్ణుప్రియ, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయి


మాట్లాడుతున్న మమతా నాగిరెడ్డి

తిరుపతి(వైద్యం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా మోసం చేస్తున్నాయని జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి మమతా నాగిరెడ్డి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో గురువారం నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బేరుపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో తిరుపతి కాంగ్రెస్ జిల్లా స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం బడ్జెట్ సమావేశంలో ఎక్కడా నిరుద్యోగుల గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని యువజన కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె తెలిపారు. వెంటనే పలు శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామారావు, విజయ్, కిషోర్, కుమార్ పాల్గొన్నారు.


# స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ర్యాంకే లక్ష్యం

తిరుపతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తిరుపతి ఉన్నత స్థానం సాధించడమే లక్ష్యంగా అందరూ పనిచేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో గురువారం కమిషనర్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా వాటర్ ప్లస్ పోటీలలో, చెత్త రహిత నగరాల్లో ఇచ్చే సెవెన్ స్టార్ రేటింగ్‌లోను ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. నగరంలో ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా చూడాలన్నారు. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు. డివైడర్లు, గోడలకు పెయింటింగ్స్ చేయించాలని అన్నారు. రోడ్లలో ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధి కారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, డీఈలు, టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

● మల్టీ పార్కింగ్‌లో మార్పులు

తిరుపతి స్మార్ట్ సిటీ నిధులతో నిర్మితమవుతున్న మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌లో స్వల్ప మార్పులు చేయనున్నట్టు కమిషనర్ చెప్పారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. మల్టీ లెవల్ కార్ పార్కింగ్ వలన అటు కార్పొరేషన్, ఇటు కార్ల యజ మానులకు పెద్ద ప్రయోజనంలేదన్న అభిప్రాయాలు వస్తున్నాయన్నారు. అందరితో మాట్లాడి అక్కడ మల్టీప్లెక్స్, ఇతర వాణిజ్య సముదాయాల నిర్మాణాలకే పరిమితం చేయాలనుకున్నట్టు చెప్పారు. పలు కమర్షియల్ కాంప్లెక్స్‌లను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం వచ్చే ఏడాది మార్చిలోపు పూర్తిచేయనున్నట్టు చెప్పారు.

## ఐజీఎన్‌సీఏతో ఎన్ఎస్‌యూ ఎంవోయూ


ఐజీఎన్‌సీఏ డైరెక్టర్ ప్రియాంకతో కలసి ఎంవోయూ పత్రాలని ప్రదర్శిస్తున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ- ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) కలసి సంగీతం, నాటకం, శిల్ప కళా వంటి విషయాలకు సంబంధించి వర్సిటీలో రీజనల్ కేంద్రం ఏర్పాటుకు గురువారం పరస్పర అవగాహనా ఒప్పందం చేసుకున్నాయి. ఈమేరకు ఐజీఎన్‌సీఏ అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ ప్రియాంకమిశ్రాతో ఎన్ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్జే రమాశ్రీ ఎంవోయూ పత్రాలను విడుదల చేశారు. కాగా జానపదనృత్యం, సాహిత్యంపై ఈ నెల21, 22తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే లోకమందన్ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని, దీనికి వర్సిటీ కోర్ట్ మెంబర్ కల్లూరి కాశీవిశ్వనాథశర్మతో కలసి పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

## ఎస్వీయూ హాస్టళ్లపై పోలీసుల నిఘా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ హాస్టళ్లలో బయటి వ్యక్తులు తిష్ట వేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ విషయంపై వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆరా తీశారు. సిబ్బంది కూడా హాస్టళ్లలో బయటి వ్యక్తులు ఉన్నారనే విషయాన్ని ధ్రువీకరించినట్టు సమాచారం. ప్రస్తుతం హెచ్-బ్లాక్ నుంచి ఈ-బ్లాక్ హాస్టల్‌కు విద్యార్థులను తరలించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో హెచ్-బ్లాక్ హాస్టల్‌ను మూత వేయనున్నట్టు తెలుస్తోంది. హెచ్-బ్లాక్, ఐ-బ్లాక్, ఎఫ్-బ్లాక్ హాస్టళ్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. ఇటు యూనివర్సిటీ అధికారులు, అటు పోలీసులు ఈ హాస్టళ్లలో ఎవరు ఉన్నారనే సమాచారం తెప్పించుకున్నట్టు సమాచారం. ఏ సమయంలోనైనా వీటిని ఆకస్మికంగా తనిఖీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.



## ప్రయాణం.. నరక ప్రాయం

అసలే వర్షాలు.. పైగా మట్టి రోడ్డు.. బురదమయమైన ఈ రోడ్డులో ప్రయాణం సాగించేందుకు పెళ్లకూరు మండలంలోని యాలకారికండ్రిగ గ్రామస్తులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. చింతపూడి గ్రామం నుంచి యాలకారికండ్రిగకు చేరుకునే రోడ్డు వర్షం కురిస్తే బురదమయంగా మారుతోంది. వాహనదారులే కాకుండా పాదచారులూ ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, కనీసం గ్రావెల్, మెటల్ పరిచి కష్టాలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

## శ్రీసిటీలో నీతి అయోగ్ సీఈవో

శ్రీసిటీ, నవంబరు 14: నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, పారిశ్రామిక వృద్ధి సామర్థ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పరిశ్రమల సీఈవోల సమావేశంలో సుబ్రమణ్యం మాట్లాడుతూ భారతదేశం అన్ని విధాలా వేగంగా దూసుకుపోతున్న ప్రస్తుత తరుణంలో పరిశ్రమల వృద్ధి, స్థాపనకు అత్యంత అనువైనదంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా, యువత అందుబాటులో ఉందన్నారు. వారిని శ్రామికశక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉద్యోగ కల్పన, ప్రాంతీయ అభివృద్ధి, స్థిరమైన ఆర్థికవృద్ధికి కీలకమైన శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు నీతి అయోగ్ కట్టుబడి ఉందని సుబ్రమణ్యం స్పష్టం చేశారు. పరస్పర చర్చల సందర్భంగా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభకు ప్రోత్సాహం, పరిశ్రమలకు సమీపంలో కార్మికుల నివాస గృహ సౌకర్యాలకు సంబంధించిన సమస్యలను పరిశ్రమల ప్రతినిధులు లేవనెత్తారు. ఇందుకు సుబ్రమణ్యం సానుకూలంగా స్పందిస్తూ వీటిని కీలకంగా గుర్తిస్తూ విధాన నిర్ణయాల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు.



సుబ్రమణ్యానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ



విలువిద్యలో ఆ యువకుడు పట్టువదలని విక్రమార్కుడు. మధ్య తరగతి నేపథ్యమైనా ఇటు విద్యలోనూ అటు క్రీడాకారుడిగా రాణిస్తూ ప్రతిభ చాటుకుంటున్నాడు తరుమూరు గణేష్ మణిరత్నం. ప్రపంచ స్థాయిలో పతకమే లక్ష్యంగా గురి తప్పకుండా కృషి చేస్తున్నాడీ విలువిద్య క్రీడాకారుడు.

- తిరుపతి(క్రీడలు)

# విలువిద్యలో 'మణిరత్నం'



విలువిద్యలో పోటీపడుతున్న గణేష్ మణిరత్నం




ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకాలతో..



నాయుడుపేటలోని భరత్‌నగర్‌కు చెందిన తరుమూరు హరిప్రసాద్ దంపతుల కుమారుడు గణేష్ మణిరత్నం. హరిప్రసాద్ సమీపంలోని టోల్‌ప్లాజాలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తన కుమారుడి ఆసక్తి గమనించి చదువుతో పాటు క్రీడా రంగంలోనూ ప్రోత్సహించాలని భావించారు. స్నేహితుల సలహాతో విలువిద్య(ఆర్చరీ)ను నేర్పించాలని సంకల్పించారు. 2016లో ఐదవ తరగతి చదువుకుంటున్న మణిరత్నాన్ని విలువిద్య కోచ్ శివశంకర్ దగ్గర చేర్పించారు. తండ్రి ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని కొన్ని నెలలకే విశాఖపట్నంలోని సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌లో శాప్ సెలక్షన్స్‌లో ఎంపికయ్యాడు. శాప్‌కోచ్ సుధాకర్‌నాయుడు దగ్గర రెండేళ్లపాటు శిక్షణ తీసుకున్నాడు. పదవ తరగతి పాస్ అయ్యాక భీమవరంలోని కోచ్ కమల కిషోర్ వద్ద శిక్షణ పొందాడు. మూడేళ్ల శిక్షణ కాలంలో జిల్లాస్థాయిలో పది స్వర్ణ పతకాలు, రాష్ట్రస్థాయిలో ఏడు బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకుని, అందరి దృష్టినీ ఆకట్టుకున్నాడు. ఆర్చరీ గుర్తింపు సంపాదించాడు.

### ప్రపంచస్థాయి గుర్తింపే లక్ష్యం

వచ్చే ఏడాది నుంచి వరుసగా విలువిద్య వరల్డ్‌కప్, వరల్డ్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్, ఏషియా గేమ్స్ జరగనున్నాయి. వీటిలో తప్పకుండా ప్రాతినిధ్యం వహించి రాణిస్తాను. దేశానికి మంచిపేరు తీసుకురావడమే నా ముందున్న ప్రధాన లక్ష్యం.

- తరుమూరు గణేష్ మణిరత్నం

### విదేశాల్లోనూ సత్తా

- 2023లో ఐర్లాండులో జరిగిన యూత్ వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో అండర్-18కాంపౌండ్ విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఇండియా నుంచి ఎంపికైన యువకుల్లో తొలిస్థానం సంపాదించాడు.
- ఈ ఏడాది జూన్‌లో సౌత్‌కొరియాలోని సువాన్‌లో జరిగిన ఏషియాకప్ స్టేజ్-3(వరల్డ్ ర్యాంకింగ్ టోర్నమెంట్)లో వ్యక్తిగతంగా ఐదవ ర్యాంకు, జట్టుతో బ్రాంజ్ మెడల్ సాధించాడు.
- ఈ ఏడాది సెప్టెంబరులో చైనీస్‌తైపైలో జరిగిన ఏషియన్ ఆర్చరీ యూత్ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగతంగాను, గ్రూపులోనూ బంగారు పతకాలు సాధించాడు.



కుటుంబ సభ్యులతో..

## ప్రభుత్వమే 108 సర్వీసు నడపాలి

### ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వాలి



సమ్మె నోటీసు చూపుతున్న 108 ఉద్యోగులతో కిరణ్‌కుమార్

తిరుపతి(లీలామహల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 సర్వీసును ప్రభుత్వమే నిర్వహిస్తూ ఈఎంటీ, పైలెట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిరణ్‌కుమార్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 108 సర్వీసు కార్పొరేటర్లకు వరంగా మారుతోందన్నారు. గతంలో కాంట్రాక్టర్లకు రూ.300 కోట్లకు పైగా చెల్లించారని తెలిపారు. కాంట్రాక్టర్ మారిన ప్రతిసారీ ఉద్యోగుల జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు తదితర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఏ శాఖలోనూ లేనివిధంగా 108 సర్వీసులో రోజుకు రెండు షిఫ్టులుగా 12 గంటల చొప్పున పనులు చేయించుకుని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు షిఫ్టుల విధానంతో 8 గంటల చొప్పున పని విధానాలను మార్చాలని, జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఇంక్రిమెంట్లు లేవు, బోనస్‌లు లేకపోయినా విధులు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో దుస్థితికి చేరిన 108 వాహనాలకు మరమ్మతులు చేయాలన్నారు. సిబ్బంది కొరత తీర్చాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలోనూ 108 అంబులెన్స్ సిబ్బందికి శాశ్వత భవనం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే 25వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. సమావేశంలో మహేష్, సునీల్, మునిరాజు, కేశవులు, సుధాకర్, శ్రీదేవి, ఊహ తదితరులు పాల్గొన్నారు.

## 4 నుంచి ఎస్వీయూలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ పరీక్షలు డిసెంబర్ 4వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలైంది. 4 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. పరీక్షల సమాచారాన్ని ఆయా కాలేజీలకు పంపినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

## జర్మనీ భాషపై శిక్షణ, ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎస్ఎం కేర్ సొల్యూషన్ సహకారంతో జర్మనీ భాషపై, నర్సింగ్ ఉద్యోగాల కల్పనపై శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం జేసీ శుభం బన్సల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం ఆవిష్కరించారు. జీఎన్ఎం బీఎస్సీ నర్సింగ్ కలిగి ఉండాలని, స్విమ్స్ నర్సింగ్ కళాశాలలో ఆరు నెలల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని లోకనాథం తెలిపారు. మరిన్ని వివరాలకు 99888 53335ను సంప్రదించాలని తెలిపారు.

## సహకార వారోత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న లక్ష్మి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ సహకార కేంద్ర బ్యాంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారిణి లక్ష్మి మాట్లాడుతూ సహకార రంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటరమణ, అధికారులు ఉమాపతి, నాగభూషణం, రవీంద్రనాథ్, పెంచలయ్య, బ్యాంకు మేనేజరు శ్రీదేవి, సురేష్, సహకార సిబ్బంది పాల్గొన్నారు.





పుష్కరిణి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ - దేవతామూర్తుల విద్యుత్ దీపాలంకరణ

## తిరుచానూరు బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

తిరుచానూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు సంబంధించి టీటీడీ అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దేవతామూర్తుల కటౌట్లు, తిరుపతి నుంచి తిరుచానూరు వరకు విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. ఆలయ పరిసరాలతో పాటు గ్రామం మొత్తం విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. భక్తులు వేచి ఉండేందుకు నవజీవన్ ఆస్పత్రి సమీప ప్రాంతాలతో పాటు ప్రైవేటు, తోలప్పగార్డెన్ బస్టాండ్ల వద్ద ఇనుప షెడ్లు సిద్ధం చేస్తున్నారు. డిసెంబరు 6న బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థం జరగనుంది. ఈ ఉత్సవానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరిణిలో పాత నీటిని తొలగించి కొత్తవి నింపనున్నారు. తొక్కిసలాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉత్సవాల ఏర్పాట్లపై విమర్శలు వచ్చిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది.

## నకిలీ డాక్యుమెంట్లతో ప్రొఫెసర్‌కు టోకరా

- నలుగురిపై చీటింగ్ కేసు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గాజులమండ్యం పోలీసులు గురువారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఎస్వీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సహదేవ్ తిరుపతి ఎమ్మార్‌పల్లిలో ఉంటున్నారు. రామచంద్రనగర్‌కు చెందిన సురేంద్ర, వెంకటసిద్దయ్య, వెంకటచెంచయ్య, భార్య రాజేశ్వరి కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. వీరందరూ 2015లో రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని ఎర్రంరెడ్డిపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 526/6ఏలో 170 అంకణాల విస్తీర్ణమున్న 4 ప్లాట్లను రూ.52 లక్షలకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ స్థలాన్ని గతేడాది కొనుగోలు చేసిన ప్రొఫెసర్ సహదేవ్ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు స్థలం వద్దకు వచ్చి పరిశీలిస్తుండగా చంద్ర అనే వ్యక్తి ప్రశ్నించాడు. ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ప్రొఫెసర్ చెప్పడంతో స్థల యజమాని అవాక్కయ్యాడు. ఎవరో మోసం చేశారని ..విచారించుకోవాలని సూచించడంతో సహదేవ్ కంగుతిన్నారు. రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించారు. వారు సర్వే నిర్వహించి చంద్ర అనే పేరుపై రిజిస్టర్ అయిందని తెలపడంతో ప్రొఫెసర్ నిర్ఘాంతపోయారు. మోసపోయానని గుర్తించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో పోలీస్‌స్టేషన్ల చుట్టూ న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదు. ఎస్పీ సుబ్బరాయుడుకు తాజాగా ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసిన నలుగురిపై గురువారం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అయింది.

## షార్‌లో ఘనంగా ప్రపంచ నాణ్యత దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పక్కనే హెచ్ఎస్ఎఫ్‌సీ డీడీ గీతాకృష్ణన్

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన బెంగళూరులోని హెచ్ఎస్ఎఫ్‌సీ డిప్యూటీ డైరెక్టర్ గీతాకృష్ణన్ మాట్లాడుతూ అన్ని విషయాల్లో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత గురించి తెలియజేసేందుకు ప్రతి ఏడాది షార్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం మంచిదన్నారు. భారత గగన్‌యాన్ కార్యక్రమంలో నాణ్యత ప్రమాణాల ప్రాముఖ్యత గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులరెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ హమీద్, గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న నెర్రి కాలువ నీరు

## సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణంలో వీధులన్నీ జలమయమయ్యాయి. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో వర్షపు నీటికి మురుగునీరు తోడై రోడ్లపై పారడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ కార్యాలయం ముందు మురుగునీరు నిలబడింది. చెంగాలమ్మ ఆలయ సమీపంలోని సూళ్లూరు వద్ద నెర్రికాలువ నీరు వంతెనపై పొంగి ప్రవహిస్తోంది. మండలంలోని మంగళంపాడు, మంగానెల్లూరు దళితవాడల్లో వర్షపునీరు రోడ్లపై నిలబడడంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. మంగానెల్లూరు దళితవాడలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు వర్షపు నీరు నిలబడి మడుగును తలపిస్తోంది. ఇక్కడ సీసీ రోడ్డు ఉన్నా వర్షపు నీరు పోయే దారిలేక ఆలయంలోకి చేరుతోంది.

### వెంకటగిరిలో మోస్తరు వర్షం

వెంకటగిరిటౌన్ : వెంకటగిరిలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా వర్షం పడడంతో చెరువులు, కుంటలు, కాలువల్లోకి నీరు చేరాయి.

## డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన కనుమూరి రఘురామకృష్ణ రాజును గురువారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## పారిశుధ్యంపై దృష్టి సారించండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి పైపులైన్‌లను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలని తెలిపారు. గ్రామాల్లో నూతనంగా పనులు ప్రారంభించేటప్పుడు అధికారులు గ్రామ సర్పంచ్‌కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం శాఖల వారీగా సంబంధిత అధికారులు నిర్వహించిన పనులు, చేయాల్సిన పనుల వివరాలను వెల్లడించారు. తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అన్నిశాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు ఎన్‌టీఆర్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి తిరుపతికి చెందిన క్రెడిట్ యాక్సస్ గ్రామీణ ఇండియా ఫౌండేషన్ నిర్వాహకులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీడీపీవో శారదాంబ ఆధ్వర్యంలో కుర్చీలు, బల్లలు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు జగదీష్, సిద్ధారెడ్డి, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనష సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు విద్యలో రాణించాలి



బాలికకు సైకిల్ అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలికలు విద్యలో రాణించాలని శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. గురువారం స్థానిక గాంధీనగర్‌లోని మినీగురుకులంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణసేవాసమితి దాతృత్వంతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందజేశారు. ఓ విద్యార్థినికి సైకిల్‌ను పంపిణీ చేశారు. వెంటేశ్వర్లురెడ్డిరెడ్డి, దశరథరామిరెడ్డి, కిరణ్‌చక్రవర్తి, జీజీనాయుడు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

## భూ రీసర్వే చేయకుండానే సర్వేరాళ్లపై పేరుకోసం నిధుల ఖర్చు: టీడీపీ



సర్వేరాళ్లపై జగనన్న భూరక్ష పేరును తొలగిస్తున్న సర్వేయర్లు, టీడీపీ నాయకులు

చిల్లకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్భాటంగా చేపట్టిన జగనన్న భూరీసర్వే కార్యక్రమాన్ని కొన్ని గ్రామాల్లో చేయకుండానే సర్వే రాళ్లపై పేరును ముద్రించేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేశారని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వర్లు నాయుడు ఆరోపించారు. గురువారం స్థానిక కడివేడు సొసైటీ గోదాము వద్ద నిల్వ ఉన్న సర్వేరాళ్లపై ఉన్న జగనన్న భూరక్ష పేరును తొలగించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కొన్ని గ్రామాల్లో రీసర్వే చేయకపోవడంతో రాళ్ల, పేరు కోసం ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయన్నారు. ఇందుకోసం కడివేడు పంచాయతీలో సుమారు రూ.8లక్షలు ఖర్చు చేశారన్నారు. మజిద్, సర్వేయర్లు శశి, సాయితరుణ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో జగదీష్ బాబు

దక్కిలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతి రోజూ రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో జగదీష్ బాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని లింగసముద్రం, సూరాయపాళెం ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు.

## డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ విద్యార్థులకు లైబ్రరీ ప్రాముఖ్యత గురించి వివరించారు.

## మహిళలకు క్యాన్సర్ పరీక్షలు



కోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్యాన్సర్‌పై విజయం-స్క్రీనింగ్‌తో సాధ్యం అనే కార్యక్రమాన్ని గురువారం స్థానిక సర్పంచ్ కోకర్ల మధుయాదవ్ ప్రారంభించారు. ఎంపీడీ-పీడీ-3.0 సర్వేని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్నపాళెం, వీరారెడ్డిసత్రం గ్రామాల్లో ఏఎన్ఎం నిరోషా ఆధ్వర్యంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి అసంక్రమిత వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వసంత, అమరావతి, చెంచుకృష్ణమ్మ పాల్గొన్నారు.

# గూడూరు
## సూళ్లూరుపేట/వెంకటగిరి

## తృటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడ్డ కంటైనర్‌ను పక్కకు తీస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని మన్నారుపోలూరు క్రాస్ సమీపంలోని ఎంఆర్ గార్డెన్ హోటల్ వద్ద గురువారం కంటైనర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. పోలీసుల వివరాల మేరకు మోటరు సైకిల్ అదుపు తప్పి పడిపోయిన సమయంలో నెల్లూరు వైపు నుంచి చెన్నైకు వెళ్తున్న కంటైనర్ మోటారు సైకిల్‌ను తప్పించబోయి అదుపు తప్పి బోల్తాపడింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. వెంటనే పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్రేన్, జేసీబీల సాయంతో కంటైనర్‌ను తొలగించారు.

## ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా ఉంటాం



విద్యార్థినికి రూ.10వేల చెక్కును అందజేస్తున్న అల్లం రమణయ్య

కోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతిభా పాటవాలు కలిగి ఆర్థిక స్థోమతలేని విద్యార్థులను దాతల సహకారంతో అన్ని విధాలుగా ఆదుకుంటామని శ్రీషిరిడీసాయి అక్షయ సేవాసమితి కన్వీనర్ అల్లం రమణయ్య హామీ ఇచ్చారు. కోటలోని అక్షయ సేవాసమితి కార్యాలయంలో గురువారం శ్యామసుందరపురం గ్రామానికి చెందిన కరుణ అనే నిరుపేద విద్యార్థినికి అజ్ఞాత దాత రూ.10వేలు చెక్కురూపంలో ఇవ్వగా... అల్లం రమణయ్య చేతుల మీదుగా అందజేశారు. శ్యామసుందరపురంకు చెందిన కురుగొండ కవిత తన కుమార్తె కరుణను నెల్లూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివిస్తుండగా ఫీజులు కట్టలేని పరిస్థితిని అక్షయ సేవాసమితి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన రమణయ్య అజ్ఞాతదాత ద్వారా విద్యార్థినికి అండగా నిలిచారు.

## భర్త తాగుడు భరించలేక భార్య ఆత్మహత్య



మృతి చెందిన కుమార్‌సుధా

తడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భర్త మరోసారి మద్యం సేవించాడని మనస్తాపం చెంది ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మండల పరిధిలోని రామాపురం పంచాయతీ ఎస్‌ఆర్‌కండ్రిగ గ్రామానికి చెందిన కుమార్‌సుధా (48) గుమ్మిడిపూడిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తోంది. ఆమె భర్త కుమార్ లారీడ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గతంలో మద్యానికి బానిసగా ఉన్న భర్తకు కుటుంబ బాధ్యతలు చెప్పి మద్యం సేవించకుండా ప్రమాణం చేయించుకుంది. అప్పటి నుంచి ఆయన మద్యం మానేశాడు. అయితే బుధవారం రాత్రి ఇంటి నుంచి రూ.500 తీసుకొని బయటకువెళ్లి మద్యం సేవించి వచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన భార్య కుమార్‌సుధా ఇంటి పక్కన ఉన్న మేకల దొడ్డిలోకి వెళ్లి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే కుటుంబసభ్యులు ఆమెను చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గోతులమయంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు



వాకాడు మండలం కొత్తూరు వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపునీరు - గూడలి వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గోతులు - దొరవారిసత్రం మండలం కల్లూరుకండ్రిగ వద్ద నీటి మడుగులా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి

కోట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కోట మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు గోతులమయం కావడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కోట నుంచి సిద్ధవరం, ఉత్తమనెల్లూరు, కర్లపూడి గ్రామాల్లో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గూడలి నుంచి బంగాళాఖాతం వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. గూడలి స్వర్ణముఖినది నుంచి నాయుడుపేట వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనచోదకులు, పాదచారులు, తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షపు నీరు నిలచిపోవడంతో గుంతలు తెలియక పలువురు వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

### చెరువును తలపిస్తున్న రోడ్డు

**వాకాడు:** మండలవ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపునీటితో నిండుకొని చెరువును తలపిస్తున్నాయి. దుగరాజపట్నం పంచాయతీలోని కొత్తూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలు పడటంతో అస్తవ్యస్తంగా మారింది. వర్షానికి నీరంతాచేరి ప్రయాణం చేయాలంటే నరకంగా ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోకాళ్లలోతు నీరు నిల్వ ఉంటుందని వాపోతున్నారు. వాకాడు నుంచి దుగరాజపట్నం మీదుగా మల్లాంకు వాహనాల రాకపోకలు సాగుతుండటంతో ప్రయాణికులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### నీటి మడుగులా రహదారి

**దొరవారిసత్రం:** మండలంలోని కల్లూరుకండ్రిగ వద్ద సూళ్లూరుపేట-వాకాడు ఆర్‌అండ్‌బీ రహదారి నీటి మడుగులా తయారైంది. వర్షాలకు పంట పొలాల్లో పడిన నీరు అంతా రహదారి పైకి చేరి మడుగులా మారింది. వర్షపు నీరు తూర్పు వైపున గల పొలాల వైపు ప్రవహించాల్సి ఉంది. మలుపు ఉన్న రహదారిలో లోతట్టుగా ఉండటంతో అక్కడ చేరిన నీరు బయటకు పోక ఆగిపోవడంతో మడుగులా ఏర్పడింది. కార్లు, ద్విచక్ర వాహన దారులకు ఇబ్బందికరంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

## ఘనంగా బాలల దినోత్సవం



గూడూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసిన పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు

గూడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ కార్యక్రమాలను గురువారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, క్రీడాపోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామమోహన్‌రావు మాట్లాడుతూ చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సనత్‌కుమార్, దేవానంద్, హెచ్‌ఎం భారతి, పీడీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబి తదితరులు పాల్గొన్నారు. నెల్లటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హెచ్‌ఎం పార్వతమ్మ, సిద్దారెడ్డి, రాఘవేంద్ర, బాబు తదితరులు పాల్గొన్నారు. స్థానిక బాలసదనంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించి విద్యార్థినులకు బిస్కెట్‌ప్యాకెట్లు అందజేశారు. అరవ పార్వతయ్య, మెహబూబ్‌బాషా, నయోమి, అరుణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిల్లకూరు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆట పోటీలు, వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు.

**నాయుడుపేట:** నాయుడుపేట ఎల్‌ఏ సాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ దాదాపీర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అధ్యాపకులు వెంకటరమణ, శేఖర్ బాబు, వెంకటేష్, బాలాజీ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

**కోట:** కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకులంలో ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత, గురుకుల పాఠశాలల్లో ఎంఈవో మస్తానయ్య ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సంబరాలు జరుపుకున్నారు.

**సూళ్లూరుపేట:** మండల పరిధిలోని అట్టకానితిప్ప ప్రాథమిక పాఠశాలలో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు లలితమ్మ, పాఠశాల హెచ్‌ఎం శ్రీహరికోట రేవతి, పాఠశాల కమిటీ చైర్మన్ కుయిల్ పాల్గొన్నారు.

**తడ:** రామాపురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో కె.మల్లికార్జున్‌రావు పాల్గొని కలాం వరల్డ్ రికార్డు సాధించిన 2వ తరగతి విద్యార్థి జయమిత్రను అభినందించి శాలువాతో సత్కరించారు. 100 మంది శాస్త్రవేత్తల పేర్లు, వారు కనిపెట్టినవాటిని చెప్పడం ద్వారా కలాం వరల్డ్ రికార్డును సదరు విద్యార్థి సాధించాడని అభినందించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మాధవి బహుమతులను అందజేశారు.



ఎల్‌ఏ సాగరం బాలుర గురుకులంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ దాదాపీర్, రాజశేఖర్, కృష్ణయ్య - అట్టకానితిప్పలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు - రామాపురంలో కలాం వరల్డ్ రికార్డును సాధించిన విద్యార్థి జయమిత్రను అభినందిస్తున్న ఎంఈవో మల్లికార్జున్‌రావు

## ప్రజాసమస్యలు పరిష్కరించాలి: సీపీఎం




గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో అంబేడ్కర్ నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. నాయకులు జోగి శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్ ప్రసాద్, ముత్యాలయ్య, మణి, చంద్రమోహన్, చంద్రయ్య, వెంకటయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

**సూళ్లూరుపేట:** ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఇచ్చిన హామీలన్నింటిని వెంటనే నెరవేర్చి ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు పద్మనాభయ్య, లక్ష్మయ్య, రియాజ్, అల్లెయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్:** తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. సీపీఎం నేత మహేష్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిత్యావసర వస్తువులు, వంటనూనె ధరలు పెరుగుతున్నాయని చెప్పారు. అనంతరం తహసీల్దారు రాజేంద్రకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు శివకవి ముకుంద, ప్రజా సంఘం నాయకులు పుట్టయ్య, రమణయ్య తదితరులు ఉన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

గూడూరు అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక మోతాదులో రసాయనిక ఎరువులను, పురుగు మందులను వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తే పెట్టుబడులు తగ్గి అధికలాభాలు పొందవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్ సూచించారు. మండలంలోని పాలిచెర్ల, పాలిచెర్లరాజుపాళెం గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రమేష్, చెంచురెడ్డి, శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ డానియేల్‌రాజ్, వైద్యసిబ్బంది

ఓజిలి, నవంబరు 14: మండలంలోని రాజుపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్షయ, న్యుమోనియా, ఇతర వ్యాధులపై ఓజిలి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ డానియేల్‌రాజ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 4డీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతోపాటు తలిదండ్రులకు కూడా అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది ద్వారా ఇంటింటా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టేందుకు సిబ్బందిని సమాయత్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యయులు నారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి అనూషా

వెంకటగిరిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భారతీయ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వెంకటగిరి కోర్టు సివిల్ జడ్జి అనూషా సూచించారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ విద్యార్థి వయస్సు నుంచి క్రమశిక్షణతో మెలగాలన్నారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్‌ను కలసిన కామిరెడ్డి



జగన్‌ను కలసిన వైసీపీ నాయకులు

పెళ్లకూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గురువారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జగన్ ఆదేశించినట్లు ఆయన తెలిపారు. అనంతరం వైసీపీ నాయకులు ఎల్లు మోహన్, గంజి దయాకృష్ణ, గోగుతొట్టి ఆనంద్ తదితరులను జగన్‌కు పరిచయం చేశారు.

## ఎయిడ్స్‌పై అవగాహన

వెంకటగిరిటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నవజీవన్ ఆర్గనైజేషన్-సీసీటీఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మీకు తెలుసా కార్యక్రమం' ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబరు 1097 ద్వారా తెలిపితే పూర్తి సమాచారం అందిస్తామన్నారు. అనంతరం మండల పరిధిలోని మరాటపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నవజీవన్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నవజీవన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

## ప్రతి టీడీపీ కార్యకర్తా సభ్యత్వం తీసుకోవాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రమేష్, వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో ఉన్న ప్రతి కార్యకర్తా పార్టీ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్ అన్నారు. గురువారం పట్టణంలోని సాయినగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్యకర్తలు సభ్యత్వం తీసుకోవడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపచేసే విధంగా అధినేత చంద్రబాబు నిర్ణయం తీసుకొన్నారని చెప్పారు. కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లు రెడ్డి, మేడా సాయి నారాయణ, బూత్ కన్వీనర్ రాజశేఖర్, కొండలరావు, హరీష్, నాని తదితరులు పాల్గొన్నారు.

**పెళ్లకూరు:** టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ ప్రమాద బీమా సౌకర్యం వర్తిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. మండలంలోని కానూరు, పునబాక గ్రామాలలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు వెంపళ్ల వెంకటేశ్వర్లు, నేలవల్లి సిద్ధులయ్య నాయుడు, మురళీ నాయుడు, నెలవల ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడ్డ ఆవు

సూళ్లూరుపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని రాఘవయ్యపేట ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఇళ్ల వద్దనున్న పాడుపడ్డ బావిలో ప్రమాదశాత్తు ఓ ఆవు పడిన సంఘటన గురువారం చోటుచేసుకొంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో బావిలో పడ్డ ఆవును సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం ఆవును పశువైద్యశాలకు తరలించి చికిత్స చేశారు.

## కిశోరబాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

వాకాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి సూచించారు. మండలంలోని వాకాడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వరదయ్యపాళెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం వరదయ్యపాళెం మండలం మత్తేరిమిట్టలో జరిగిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల స్క్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలను అందరికి నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సూళ్ళూరుపేట ఆర్డీవో కిరణ్మయి, డీఎంహెచ్‌వో శ్రీహరి, తహసీల్దారు రాజశేఖర్, డాక్టర్ అనిత, కార్యదర్శి పద్మనాభరాజు ఇంజనీరింగ్ అసిస్టెంట్ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

●బుచ్చినాయుడుకండ్రిగ: నీర్పాకోటలో క్యాన్సర్ సర్వేను డీఎంఅండ్‌హెచ్‌వో మృదులవాణి గురువారం పరిశీలించారు. సర్వే చేస్తున్న వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డాక్టర్ దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి క్యాన్సర్లపై గురువారం అవగాహన కల్పించారు. క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు.

## నిరాశ్రయుల వసతి గృహానికి నిత్యావసర సరుకుల వితరణ



శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహానికి డాక్టర్ కిషోర్ రత్నం పాఠశాల విద్యార్థులు హ్యాండ్ టూ హ్యాపీనెస్ కార్యక్రమంలో భాగంగా నిత్యావసర సరుకులను వితరణ చేశారు. గురువారం రూ.50వేలు విలువ చేసే సరుకులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ కిషోర్, డాక్టర్ వాసంతి కిషోర్, ప్రిన్సిపాల్ కిరణ్, ఉపాధ్యాయులు, యువతరం సేవాసమితి సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం


సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్పేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడే సుబ్రహ్మణ్యాన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నిర్మల్‌కుమార్, ఉపాధ్యాయులు గుణశేఖర్ రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, కుమార్‌రాజా, ఉమామహేశ్వరి, సురేష్‌బాబు, రాధాకుమారి, రామచంద్రయ్య, వెంకటేశులు, విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

## మారేడు కాలువ వంతెనను పునర్ నిర్మించాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

వరదయ్యపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోవర్ధనపురం వద్ద మారేడు కాల్వ వంతెనను పునర్ నిర్మించాలని సీపీఐ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ కొద్దిపాటి వర్షం వచ్చినా వంతెనపైకి నీరు చేరడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమ్మ భగవాన్ ట్రస్టు, కల్కి ట్రస్టు సహకారంతో వంతెన నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దొడ్డి సిద్ధులయ్య, పొన్నేరి బాలగురునాథం, కఠారి తరుణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు మునిచంద్ర, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు నాగార్జున, మురళి తదితరులు పాల్గొన్నారు.

●బుచ్చినాయుడుకండ్రిగ : గ్రామాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి, గృహ నిర్మాణాలకు రూ 5లక్షలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఈ నెల 18న సచివాలయాల వద్ద జరిగే ధర్నా కరపత్రాలను గురువారం విడుదల చేశారు.

## విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వరదయ్యపాళెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, టీషర్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈవో గున్నయ్య, ట్రస్టు సభ్యులు దేవేంద్ర, చెంచురామిరెడ్డి, ఓంకార్, మునిరాజా పాల్గొన్నారు.

## 18న ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల18న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ తెలిపారు. పలు బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అయిన వారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు తమతో పాటు ఆధార్‌కార్డు జెరాక్స్, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్సులు, బయోడేటా తీసుకురావాలన్నారు. వివరాలకు 7985095540, 8919889609 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

## ముక్కంటి సేవలో మాజీ మంత్రి దేవినేని ఉమ

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామిని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు. మృత్యుంజయస్వామిసన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

## గంజాయి విక్రయం ఇద్దరి అరెస్టు

పుత్తూరు అర్బన్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): గేట్ పుత్తూరు పరిధిలో మట్కాతో పాటు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అర కిలో గంజాయి, రూ.3 వేల నగదు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం సీఐ సురేందర్ నాయుడు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పాత నేరస్తులు సుందర్, బాలాజీలు పట్టుబడ్డారు. నిందితులు ఇంట్లోనే మట్కా నిర్వహణతో పాటు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు ఆధారాలు లభించాయి.

## బైకు ఆటో ఢీకొని నలుగురికి గాయాలు


ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. స్థానికుల. కథనం మేరకు గురువారం కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద ఆటోను ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఇద్దరికి, ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు రుయాకు తరలించారు.

## యువకుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య కథనం మేరకు తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగకు చెందిన నాగులు(18) శ్రీకాళహస్తిలోని ప్రైవేటు దుకాణంలో పనిచేస్తుంటాడు. కుటుంబ కలహాలతో గురువారం ఇంటి వద్ద గడ్డి మందును తాగాడు. కుటుంబ సభ్యులు ఇతడిని రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## నేడు గుడిమల్లంలో కార్తీక పౌర్ణమి వేడుకలు

ఏర్పేడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. ఆలయంలో నిర్వహించే లక్ష దీపాలంకరణకు రేణిగుంటకు చెందిన వినాయక ట్రేడర్స్ యజమాని రాజ్యపాండియన్ నాలుగు డబ్బాల దీపం నూనె సమకూర్చారు. ఆయనకు ఆలయ పండితులు తీర్థప్రసాదాలను అందజేశారు. పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

## ప్రజాధనం రాళ్లపాలు



రాజుల సొమ్ము రాళ్ళపాలు అనే సామెతకు గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సర్వే రాళ్ల వ్యవహారం అతికినట్టు సరిపోతుంది. జగనన్న భూరక్ష పథకం పేరుతో పొలాల్లో కొత్తగా సర్వే రాళ్ల ఏర్పాటు చేసేందుకు రూ.700 కోట్ల ప్రజాధనం వెచ్చించింది. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ ముద్రించింది. 2020 నుంచి నాలుగేళ్లపాటు ఈ పథకం ప్రహసనంలా కొనసాగింది. అయినా పొలాల్లో వీటిని నాటేందుకు నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా కోట్ల రూపాయల ప్రజాధనం రాళ్ళ పాలైంది. నాగలాపురం మండలం గోపాలపురం, వేంబాకం తదితర ప్రాంతాల్లో పొలాల్లో వృథాగా పడి ఉన్న సర్వే రాళ్ళు ఇందుకు సాక్ష్యం.

-సత్యవేడు(ఆంధ్రజ్యోతి)

## పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవం






పల్లం ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీల్లో విద్యార్థులు-కలర్ ప్రింటర్ అందజేత- సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీరాణి

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాస్కరపేట పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి హాజరై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, శ్రీరామ్, సింధు, రెండవ పట్టణపోలీసులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ●మండలంలో ఆదర్శపాఠశాలలో కార్యక్రమానికి ఎంపీడీవో రాధారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, ఎస్ఎంసీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, వైస్ చైర్మన్ సంధ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ●తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు శ్రీకాళహస్తి రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కలర్ ప్రింటర్‌ను వితరణ చేశారు. వ్యాసరచన, స్పీచ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చెంచురెడ్డి, ఉపాధ్యాయులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ●బుచ్చినాయుడుకండ్రిగ: కల్లివెట్టు, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలు, శ్రీనివాసతేజ, ఎస్‌వీఆర్ ప్రయివేట్ పాఠశాలలో బాలల దినోత్సవం జరిగింది. ఎంఈవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. ●ఏర్పేడు: రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల ఆధ్వర్యంలో పాతవరాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు, చాకెట్లు పంచిపెట్టారు. ప్రధానపాధ్యాయులు భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఎస్‌వీఎస్ బాలల గ్రామంలో క్రీడాపోటీలు నిర్వహించారు. పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ●పిచ్చాటూరు: వేలూరు, కీళపూడి, వెంగళత్తూరు, కొత్తగొల్లకండ్రిగ అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం: సీపీఎం



ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకుల నిరసన

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలులో కూటమి సర్కార్ విఫలమైందని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి అన్నారు. ప్రజాపోరు ముగింపు సందర్భంగా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారంధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు పేరిట ప్రభుత్వం సామాన్యులపై భారం మోపేందుకు సిద్ధపడిందన్నారు. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పెనగడం గురవయ్య, కుమార్, వెంకటయ్య, వేణు, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

●కేవీబీపురం: సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ మాట్లాడారు. మైనార్టీ, దళితులపై దాడులు అరికట్టాలని కోరారు. నాయకులు వరలక్ష్మి, లక్ష్మయ్య, శంకరయ్య, వెంకటేశ్వర్లు, బుజ్జమ్మ, నాగమ్మ, నాగరాజు పాల్గొన్నారు. ● బుచ్చినాయుడుకండ్రిగ: కుక్కంబాకం రెవెన్యూలోని సర్వే నెంబరు 81లోని ప్రభుత్వ భూమిని దళితులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం నాయకులు, దళితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

## స్మార్ట్‌మీటర్లపై అపోహలు వద్దు: డీఈఈ

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రక్రియ చేపట్టామన్ని విద్యుత్ డీఈఈ సుధాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు వీటిపై అపోహలు పెంచుకోవద్దన్నారు. అవసరమైన ఫైవ్‌స్టార్ రేటింగ్ పరికరాలను రిజిస్ట్రేషన్ చేసుకుంటే నేరుగా ఇంటికే చేరతాయన్నారు. వీటి వలన విద్యుత్ ఆదాతోపాటు అదనపు ఛార్జీలు ఉండవన్నారు.

## యువకుడిపై పోక్సోకేసు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గూడూరులో ఓ మైనర్ బాలిక కనిపించడంలేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. ఫోన్ సిగ్నల్ ఆధారంగా బాధిత బాలిక రేణిగుంట పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించారు. స్థానిక వేణుగోపాలపురానికి చెందిన వంశీ అనే యువకుడు ఈ బాలికను వివాహం చేసుకున్నట్లు తేలింది. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందుతుడిని గురువారం కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ తెలిపారు.

## విద్యార్థులు సామాజిక అవగాహన పెంచుకోవాలి

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సామాజిక విషయాలపై అవగాహన పెంచుకుని స్వీయరక్షణ పద్ధతులు పాటించాలని మహిళ అభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి జయలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణకుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి శివశంకర్, ప్రగతి సంస్థ వ్యవస్థాపకులు రమణ, బాలాజీ, బాల వికాస్ ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి, హెచ్ఎం విష్ణువర్ధని పాల్గొన్నారు.

## వసతి గృహానికి వీధిదీపాల వితరణ

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన బాలికల వసతిగృహాన్ని జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత ఇటీవల సందర్శించారు. అక్కడి సమస్యలను గుర్తించారు. గురువారం సొంత ఖర్చుతో హాస్టల్‌కు ఆరు వీధి దీపాలను వితరణ చేశారు. కంప్లైంట్ బాక్సు ఏర్పాటు చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, జ్యోతిరామ్, రాజ్యలక్ష్మి, కవిత, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఎన్‌కండ్రిగలో మొదలైన వ్యవసాయ పనులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతాంగం రబీ సాగు పనులు మొదలు పెట్టారు. వర్షాలకు తోడు గంగ నీరు చెరువులకు రావడంతో చెరువులు, కులుజులు పారుతున్నాయి. ఇప్పటికే నారుమడులు పోశారు. సకాలంలో వర్షాలు రాకపోయినప్పటికి తెలుగుగంగ నీరు చెరువుల్లోకి రావడంతో పంటలు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో వెల్ది పైరులు వేశారు. ప్రస్తుత వర్షాలు వెల్ది పంటలకు ఉపకరిన్నాయి.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కేవీబీపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని సీడీపీవో శోభారాణి, ఎంఈవో దయాసాగర్ చెప్పారు. గురువారం మండలంలోని బైరాజులకండ్రిగ, కేజీబీవీలోని పాఠశాల విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు జరగడం వలన అనారోగ్యం పాలవుతారన్నారు. బాగా చదుకుని ఉన్నతస్థాయి ఎదిగి తమ కాళ్లపై తాము నిలబడినపుడే వివాహాలు చేసుకోవాలన్నారు. కల్పలత, సుమతి, ప్రత్యేక అధికారి సుకన్య, మంజువాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సీఆర్ రాజన్‌కు సత్కారం

పిచ్చాటూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వన్నియకుల క్షత్రియ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ సీఆర్‌రాజన్‌ను గురువారం మండల టీడీపీ నాయకుడు ఇళంగోవన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌కు పూలమాల వేసి సన్మానించారు. టీడీపీ నాయకులు పద్దురాజు, జయచంద్రనాయుడు, రవి పాల్గొన్నారు.

## యానాదులకు ఆధార్, బ్యాంకు ఖాతాలు

వరదయ్యపాళెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర ఎస్టీకాలనీ, పాండూరు పంచాయతీ, వరదయ్యపాళెంలలో యానాదులకు ఆధార్, బ్యాంకు ఖాతాలు కల్పించేందుకు రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం సర్వే చేశారు. 10మందికి ఆధార్‌కార్డు, 15మందికి బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించారు. అడిషనల్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ అధికారి అనీష్, కిరణ్‌కుమార్, జాన్, బషీర్, బాషా పాల్గొన్నారు.

## ఇండో-మిమ్‌ను సందర్శించిన విద్యార్థులు

రేణిగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇండో-మిమ్ పరిశ్రమను మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ విద్యార్థులు గురువారం సందర్శించారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు వింధ్య, రాజేంద్ర పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో జోరువాన

శ్రీకాళహస్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం జోరువాన కురిసింది. ఉదయం 10గంటలకు, సాయంత్రం 4గంటల సమయంలో భారీగా వానపడింది. సాయంత్రం వర్షానికి పట్టణంలోని లోతట్టు వీధులన్నీ జలమయమయ్యాయి. జయరామరావువీధి, రంగయ్యబడి వీధి, కూరగాయాల మార్కెట్ సందు, బలరాం థియేటర్ సందు, నగరి వీధి, గాంధీవీధిలో భారీగా వర్షపునీరు రోడ్లపై ప్రవహించింది.

## పుత్తూరు వార్తలు

### కార్తీక దీపోత్సవానికి ఏర్పాట్లు

వడమాలపేట, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా యోగుల పర్వతంపై దీపోత్సవానికి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ తెలిపారు. శుక్రవారం ఉదయం గణపతికి అభిషేకం, నాగదేవత పూజ, శ్రీవారి పాదాలకు అభిషేకం, అలంకరణ, సిద్ధేశ్వరస్వామికి పంచామృత అభిషేకం, సాయంత్రం నెయ్యి దీపోత్సవం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. భవాని శంకర దేవాలయంలో 17 నుంచి ఆరుద్ర నక్షత్ర పూర్వక వార్షికోత్సవ రుద్రాభిషేక కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.

### రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీ


విత్తనకాయల పంపిణీ చేస్తున్న వెంకటేష్

పుత్తూరు టౌన్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): తడుకులోని రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో విత్తన కాయలను పొందవచ్చనన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆదిమందడి, టీడీపీ నాయకులు అమర్నాథ్‌రాజు, భాస్కర్‌శెట్టి, వ్యవసాయాధికారి తరుణ్, పంచాయితీ సెక్రటరీ నరేష్, రైతులు పాల్గొన్నారు.

## నెలాఖరులోగా సీసీ రోడ్ల పనులు పూర్తిచేయాలి: కలెక్టర్


సీసీ రోడ్డు నిర్మాణాన్నిపరిశీలిస్తున్న కలెక్టర్

నారాయణవనం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): సిమెంటు రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం పాలమంగళం దక్షిణం పంచాయితీ బీసీ కాలనీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిదులతో చేపడుతున్న సిమెంటు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ నెలలోపు మడంలంలో సీసీ రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సింగిరికోనలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు గిరిబాబు, ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్,ఎంపీడీవో గుణశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా కల్యాణ వెంకన్న జలవిహారం



నారాయణవనం, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధంగా ఉన్న పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్వామి పద్మ సరస్సులో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించి మూలవిరాట్‌లకు అభిషేకాలు నిర్వహించారు. 9 గంటలకు స్నపన తిరుమంజనం చేశాక ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగింపుగా పద్మసరస్సుకు వేంచేపు చేశారు. అనంతరం స్వామివారు జలవిహారం చేస్తూ భక్తులను కటాక్షించారు.టీటీడీ స్థానిక ఆలయాల ఏఈవో మోహన్, ఆలయాధికారి నాగరాజు, భరత్, భద్రతా జమేదార్ మల్లికార్జున ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని సీపీఎం ధర్నా

పుత్తూరు టౌన్, నవంబర్ 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు కారణంగా చిరు వ్యాపారులు, పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. జ్యోతిబసునగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ధర్నాలో సీపీఎం నాయకుల మునిశంకర్, నరసింహులు, గోవిందరెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.